సాక్షి పెద్దపల్లి
మంగళవారం ¦ 21 ¦ జనవరి ¦ 2025



ఉపాధ్యాయుల నిరసన

రామగుండం: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కంబాలపల్లి రాములుపై దాడికి వ్యతిరేకంగా అంతర్గాం మండలం బొట్యాల హైస్కూల్‌లో నిరసన తెలిపారు.



అమెరికాలో ఎమ్మెల్యే ఠాకూర్

గోదావరిఖని: అమెరికాలోని ఇల్లీనాయిస్ ఇన్‌స్టిట్యూట్ అధినేత సేమ్‌పెట్రోడను రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ కలిశారు. ఆయనతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
30.0/13.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. ఉదయం, రాత్రి వేళ చలితీవ్రత పెరుగుతుంది. మంచుకురిసే అవకాశం ఉంది.

ఉపాధితో సాగు బాగు

- వ్యవసాయానికి అనుసంధానిస్తేనే మేలు
- వేధిస్తున్న కూలీల కొరతను అధిగమించే అవకాశం
- నీతి ఆయోగ్ సిఫారసుల అమలుకు అన్నదాతల డిమాండ్



ఉపాధిహామీ పనులు చేస్తున్న వలస కూలీలు

సాక్షి, పెద్దపల్లి: ఉపాధిహామీ పథకం అమలుతో వ్యవసాయ రంగంలో కూలీల కొరత ఏర్పడింది. ఈ సమస్య రైతులను నిత్యం వేధిస్తోంది. కూలి రేట్లు కూడా ఏటా పెరుగుతున్నాయి. పంట పెట్టుబడి అధికమవుతోంది. వీటన్నింటినీ అధ్యయనం చేసిన నీతి ఆయోగ్ కమిటీ.. ఉపాధిహామీని వ్యవసాయ రంగానికి అనుసంధానిస్తే కూలీల కొరత తీరడంతోపాటు రైతులపై ఆర్థికభారం తప్పుతుందని కేంద్రప్రభుత్వానికి నివేదించింది. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు ఇందుకు అనుకూలమేనని ప్రకటించారు. అంతేకాదు.. వివిధ సందర్భాలు, ఎన్నికల ప్రచారంలో ఈ విషయంపై హామీలు గుప్పిస్తున్నారు. కానీ, ఏళ్లు గడుస్తున్నా ఉపాధిహామీ వ్యవసాయ రంగానికి అనుసంధానం ప్రక్రియ కార్యరూపం దాల్చడంలేదు.

నీతి ఆయోగ్ సిఫారసులు ఇవీ..

వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చడం, రైతులకు తోడ్పాటు అందించడం కోసం ఉపాధిహామీని వ్యవసాయ రంగంతో అనుసంధానించాలని 2016 ఏప్రిల్‌లో నీతి ఆయోగ్ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఉపాధి కూలీలను వ్యవసాయ పనులకు పంపించాలని, అందుకు అయ్యే ఖర్చును 75 శాతం రైతు, 25శాతం ఉపాధి హామీ పథకం భరించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. రాష్ట్రాలు కూడా తమ వంతుగా ఈ పథకాన్ని అమలు చేయాలని కమిటీ పేర్కొంది. ఇందులో 62 శాతం వ్యవసాయ అనుబంధ పనులే ఉండేలా ఉపాధిహామీ నిబంధనలను మార్చింది. కానీ, క్షేత్రస్థాయిలో ఈ పనులు పూర్తిస్థాయిలో అమలుకావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువులు, కుంటల్లో పూడికతీతకే పరిమితంకాకుండా సొంత వ్యవసాయ బావుల్లోనూ పూడికతీతకు అనుమతించాలని, వరినాట్లు, కలుపు, పత్తితీత, వరి కోతలు లాంటి పనులను కూడా ఉపాధిహామీ పథకంలో చేర్చాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

భారమైన యంత్రాలు, కూలి ఖర్చులు..

కొన్నిగ్రామాల్లో వ్యవసాయ పనులు జోరుగా సాగే రోజుల్లో ఉపాధిహామీ పనులు నిలిపివేయాల్సి వస్తోంది. పొలాల్లో వరి నాట్లు వేసినప్పటి నుంచి కోతలు, నూర్పిడి వంటి పనులకు కూలీల కొరత ఎదురవుతోంది. దీంతో రైతులు స్వయంగా సమీప గ్రామాల నుంచి ట్రాలీఆటోలు, ట్రాక్టర్లలో కూలీలను తీసుకొస్తున్నారు. ఇందుకోసం రవాణా ఖర్చులు వారే భరిస్తున్నారు. మరోవైపు.. వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా రాయితీపై రైతులకు వ్యవసాయ పరికరాలు అందిస్తున్నా.. వాటిద్వారా బడారైతులకే ప్రయోజనం కలుగుతోంది. ఐదెకరాల్లోపు వ్యవసాయ పొలం ఉన్న చిన్న, సన్నకారు రైతులు యంత్ర పరికరాలకు అధిక అద్దె చెల్లించే పరిస్థితి లేదు. పైగా అద్దెకన్నా.. కూలి ఖర్చే తక్కువగా ఉంటోంది. అంతేకాదు.. యంత్రపరికరాల కోసం ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు అవసరం. అధికారులు, దళారులకు మామూళ్లు ముట్టజెపాల్సి వస్తోంది. ఇదంతా రైతుకు తడిసి మోపెడవుతోంది. అందుకే అన్నదాతలు వ్యవసాయ యంత్ర పరికరాల జోలికి వెళ్లడం లేదు.

నిర్ణయం ప్రభుత్వాలదే..

వ్యవసాయ రంగాన్ని ఉపాధిహామీ పథకంతో అనుసంధానించడమనేది పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతిలోని వ్యవహారమని డీఆర్డీవో అధికారులు అంటున్నారు. సర్కారు నిర్ణయం తీసుకుంటే క్షేత్రస్థాయిలో తాము పక్కాగా అమలు చేస్తామని వారు వివరిస్తున్నారు.

జిల్లా సమాచారం

రైతులు	1,44,491
సాగు భూములు(ఎకరాల్లో)	2,49,419
జాబ్‌కార్డుదారులు	1,19,011
పనులకు హాజరయ్యే కూలీలు	2,43,489

డ్రమ్‌సిడర్‌తో నాట్లు వేసిన



ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఉపాధిహామీని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. పెట్టుబడి ఖర్చు సగానికి తగ్గుతుంది. వ్యవసాయ రంగం లాభసాటిగా మారితే మాతోపాటు ప్రజలకు కూడా ప్రయోజనం కలుగుతుంది. ప్రస్తుతం కూలీల కొరతతో నాకున్న రెండెకరాల్లో డ్రమసీడర్‌తో వరి వేస్తున్న.

– వేలుపూరి అశోక్‌రావు, రైతు, హరిపురం

వలస కూలీలతో నాటు వేయించిన



ఊళ్లో ఉన్నవాళ్లు వంద రోజుల పనికి పోతున్నారు. యాసంగి పనులకు కూలీలు దొరుకుతలేరు. అందుకే నాకున్న ఐదెకరాల్లో కలకత్తా కూలీలతో నాటు వేయించిన. 20మంది కూలీలు ఎకరాకు రూ.5,500 చొప్పున కూలి తీసుకుని రెండ్రోజుల్లో నాటు పూర్తిచేశారు. మొత్తం ఖర్చు రూ.27,500 అయింది. ఉపాధి హామీని అనుసంధానిస్తే ఖర్చు తగ్గుతుంది.

– మారం పోశాలు, రైతు, గుండ్లపల్లె

న్యూస్‌రీల్

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ వేణు

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లో నిర్వహించే రిపబ్లిక్ డే నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అడిషనల్ కలెక్టర్ వేణు ఆదేశించారు. జిల్లా అధికారులు, పోలీసు తదితర శాఖల అధికారులతో సోమవారం తన కార్యాలయంలో సమావేశమై పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రొటోకాల్ ప్రకారం అతిథులు కూర్చునేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల ఫలాలను లబ్ధిదారులకు అదేరోజున(ఈ నెల 26న) ప్రొసీడింగ్స్ అందిస్తామని, అధికారులు ఆ ఏర్పాట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ గజ్జి కృష్ణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అందంగా.. ఆకర్షణీయంగా..



బోగీపై 'పుష్కర' చిత్రాలు

రామగుండం: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఈనెల 13 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్న మహా కుంభామేళాకు భక్తులు భారీ సంఖ్యలో తరలివెళ్తున్నారు. వీరికోసం రైల్వేశాఖ ప్రయాగ్‌రాజ్ నుంచి నడిచే రైలు బోగీలను రంగురంగులతో అందంగా రూపొందించింది. మహాకుంభ్ మేళా విశేషాలు, ప్రముఖ ఆలయాల చిత్రాలను బోగీలపై అతికించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది. ముఖ్యంగా పుణ్యస్నానాలు ఆచరించే విశేష తేదీలు, సంగమ పుణ్యస్నానాల చిత్రాలు, మహాకుంభ్ విశిష్టత, ప్రయాగ్‌రాజ్‌లోని ఆలయాల సమగ్ర సమాచారం, దర్శనీయ క్షేత్రాల సమాచారంతో బోగీలను ముస్తాబు చేసింది. రామగుండం రైల్వే స్టేషన్ నుంచి వెళ్తున్న ఈ రైళ్ల ప్రయాణికులు, స్థానికులను ఆకట్టుకుంటున్నాయి.

క్వింటాల్ పత్తి రూ.7,223

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం పత్తి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.7,223 ధర పలికింది. కనిష్ఠంగా రూ.6,755, సగటు రూ.7,068 ధర నమోదైందని మార్కెట్ కమిటీ ప్రత్యేక కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ సోమవారం తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన 893 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు ఆయన వివరించారు.

క్రీడాస్ఫూర్తి అవసరం



పరిచయం చేసుకుంటున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: ఆటల పోటీల్లో గెలుపోటములు ముఖ్యం కాదని, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగడం అవసరమని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో రెండోరోజు సోమవారం జరిగిన కాళేశ్వరం జోన్‌స్థాయి లాన్‌టెన్నిస్ పోటీలకు ఆయన హాజరయ్యారు. సీపీ మాట్లాడుతూ, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం పెంపొందుతుందని, పనిఒత్తిళ్లను అధిగమించి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటి ఈప్రాంతానికి పేరు తీసుకు రావాలని సూచించారు. అడిషనల్‌డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్, ఏఆర్ ఏసీపీలు రాఘవేంద్రరావు, ప్రతాప్, సుందర్‌రావు, ఆర్‌ఐలు దామోదర్, శ్రీనివాస్, మల్లేశం, సంపత్, సంతోష్, పీజికల్ డైరెక్టర్స్ శ్రీనివాస్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి వార్డుసభలు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు వివిధ డివిజన్లలో వార్డుసభలు నిర్వహిస్తామని కమిషనర్ అరుణశ్రీ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులకు లబ్ధిదారులను ఈ సందర్భంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 9 – మధ్యాహ్నం 12 గంటలకు 10 డివిజన్లు, మధ్యాహ్నం 2 – సాయంత్రం 5గంటల వరకు మరో 10 డివిజన్లలో సభలను నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. జాబితాలో పేర్లు లేనివారి నుంచి సభల్లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆమె తెలిపారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

పెద్దపల్లిరూరల్: అంతర్గాంలోని ముర్మూర్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద సంపు పైప్‌లైన్ పనులు జరుగుతున్నందున మంగళవారం(ఈ నెల 21న) తాగునీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు మిషన్ భగీరథ ఈఈ పూర్ణచందర్ తెలిపారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాలతోపాటు పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి, ఓదెల, పాలకుర్తి, ఎలిగేడు, సుల్తానాబాద్ మండలాల్లోని వివిధగ్రామాల్లో తాగునీటి సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

48 గంటల్లో 'సదరం' సర్టిఫికెట్

- దళారులను ఆశ్రయించి మోసపోవద్దు
- కలెక్టర్ కోయ శ్రీహర్ష



పనుల ప్రగతిపై ఆరా తీస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని దివ్యాంగులు సదరం శిబిరానికి హాజరైన తర్వాత 48 గంటల్లోపే సర్టిఫికెట్లు జారీ చేస్తున్నామని, దివ్యాంగులు డీఆర్డీవో కార్యాలయం నుంచి ధ్రువీకరణపత్రాలు పొందాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం గోదావరిఖనికి చెందిన దివ్యాంగురాలికి డీఆర్డీవో కాళిందినితో కలిసి సదరం సర్టిఫికెట్ అందించారు. అనంతరం పలు సూచనలిచ్చారు. శిబిరానికి హాజరైన వారికి వైకల్య నిర్ధారణ ధ్రువీకరణపత్రం కోసం తిరగాల్సిన అవసరం లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. సర్టిఫికెట్ల కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కలెక్టర్ సూచించారు. సదరం శిబిరాలు సర్టిఫికెట్ల జారీ తదితర విషయాలపై ఏమైనా సందేహాలు ఉంటే సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఆ తర్వాతే కలెక్టరేట్‌లోని డీఆర్డీవో కార్యాలయానికి రావాలని ఆయన సూచించారు.

ఏటీసీ భవనం పూర్తిచేయాలి

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో చేపట్టిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) భవన నిర్మాణాన్ని ఈనెలాఖరులోగా పూర్తిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. సోమవారం భవన పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. యువతకు ఉపాధి శిక్షణ ఇచ్చేందుకు ఏటీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలతో విద్యార్థులకు శిక్షణ ఇస్తారని అన్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి శిక్షణ ఇచ్చే పరికరాలను నూతన భవనంలో బిగించే ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ డిజిటల్ లాక్

- పట్టుకున్న వెంటనే శబ్దం
- అప్రమత్తం చేస్తున్న తాళం



అప్రమత్తం చేసే డిజిటల్ లాక్

గోదావరిఖని: చోరీల నియంత్రణకు ప్రజలు డిజిటల్ లాక్(తాళం) వినియోగించేలా పోలీసుశాఖ ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. తాళం వేసిన ఇళ్లు లక్ష్యంగా దొంగలు చోరీలు చేస్తుండడంతో వీటికి ఆధునిక సాంకేతికతతో కూడిన తాళంతో చెక్ పెట్టాలని ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం యాంటీథెఫ్ట్ అలారం లాక్, యాంటీ థెఫ్ట్ అలారం డోర్, విండోస్ తదితర పరికరాలు వినియోగించాలని సూచిస్తున్నారు. ఇవన్నీ ఆన్‌లైన్ మార్కెట్‌లోనే లభిస్తున్నాయి. దొంగలు ఒకవేళ తాళం పగులగొట్టేందుకు యత్నిస్తే.. వెంటనే అలారం మోగుతుంది. ఇరుగుపొరుగువారు అప్రమత్తమయ్యే అవకాశం ఉంది. అందుకే వీటిని వినియోగించాలని పోలీస్ శాఖ సూచిస్తోంది.

ఆన్‌మోడ్‌లోనే..

ఇంటి తలుపు లేదా కిటికీ తెరిచే సమయంలో అలారం మోగేందుకు వీలుగా డిజిటల్ యాంటీ థెఫ్ట్ డివైస్ అమర్చాలి. దీనిని ఎల్లవేళలా ఆన్‌మోడ్‌లో ఉంచాలి. దీనిద్వారా కొత్త వ్యక్తులు తలుపులు తీసే ప్రయత్నం చేసిన వెంటనే ఇంట్లో ఏర్పాటు చేసిన డిజిటల్ డివైస్ నుంచి భారీ శబ్దం వస్తుంది. దీంతో దొంగలు భయపడి అక్కడి నుంచి పారిపోతారని భావిస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ కిటికీలపై అలారం ఏర్పాటు మరింత ఉపయోగకరంగా ఉంటుంది. ఇది 105 – 110 వరకు డెసిబుల్స్ శబ్దంతో మోగుతుంది. చాలాదూరం వరకు శబ్దం స్పష్టంగా వినిపిస్తుంది.

ధర రూ.300 – రూ.500

నాణ్యమైన డిజిటల్ లాక్, డోర్ డివైస్‌లు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ కామర్స్ సైట్స్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటిధర ఒక్కోటి రూ.300 నుంచి రూ.500 వరకు పలుకుతోంది. గాడ్జెట్లను ఆన్‌లైన్‌లో పరిశీలించి, పూర్తిగా తనిఖీ చేసుకున్నాకే కొనుగోలు చేయాలి. వీటి పనితీరు, వినియోగంపై యూట్యూబ్‌లో తెలుసుకోవచ్చు.

క్రీడలు జీవితంలో భాగం కావాలి



సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రతీఒక్కరి జీవితంలో క్రీడలు భాగం కావాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. పట్టణంలోని దర్గా వీధిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సోమవారం ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. దేహదారుఢ్యం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణకు క్రీడలు దోహదపడతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంతటి పుష్పలత, నాయకులు వేగోళం అబ్బయ్య, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సహకారంతో అభివృద్ధి

మంథని: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా బల్దియాలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ తెలిపారు. పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో బల్దియాలో సోమవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పలు తీర్మానాలు చేశారు. అభివృద్ధిలో భాగంగా ప్రతీవార్డులో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.కోటి చొప్పున 13 వార్డులకు రూ.13 కోట్లు కేటాయించి 85 శాతం పనులు పూర్తి చేయించినట్లు రమ తెలిపారు. వైస్‌చైర్మన్ శ్రీపతి బానయ్య, కమిషనర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పరిమాణం తగ్గుతోంది

- చట్నీ నాసిరకంగా ఉంటోంది
- అస్తవ్యస్తంగా సింగరేణి క్యాంటీన్లు
- అల్పాహారంపై కార్మికుల పెదవి విరుపు

సాక్షి ఫోకస్

మెనూ ఇది

- ఇడ్లీ, వడ, పూరి, ఉప్మా, ఖార, మసాల వడ, బోండాతోపాటు ఓసీపీల్లో ఆలూబిర్యాని, ఫ్రైడ్‌రైస్, కిచిడి, పులిహోర, కర్డ్‌రైస్.

- 2013 మార్గదర్శకాల ప్రకారం ఒక యూనిట్‌లో 120 వడలు తయారు చేయాలి. చట్నీ కోసం అరకిలో పల్లీలు, రెండు కొబ్బరికాయలు వినియోగించాలి. కానీ, 30 పేట్ల వడలకు అవసరమైన చట్నీకోసం అరకిలో పల్లీలు, రెండు కొబ్బరికాయలు వినియోగగిస్తున్నారు.



- సింగరేణి క్యాంటీన్లను కార్పొరేట్‌స్థాయిలో తీర్చిదిద్దుతున్నాం. కానీ, మెత్తటి ఉప్మా, నాసిరకం చట్నీ వడ్డిస్తున్నారు.. నేను ఇంట్లో కూడా ఇలాంటి టిఫిన్ తినలేదు. తినను కూడా.

– ఆర్జీ–2లోని ఓసీపీ–3 క్యాంటీన్‌లో అల్పాహారం నాణ్యతపై డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి ఆగ్రహం

గోదావరిఖని: సింగరేణి సంస్థ తమ కార్మికుల కోసం గనులు, వివిధ డిపార్ట్‌మెంట్లపై టిఫిన్(అల్పాహారం), టీ, కాఫీ అందించేందుకు రాయితీతో కూడిన క్యాంటీన్లు నిర్వహిస్తోంది. కార్మికులకు రుచి, శుచి, శుభ్రతతోపాటు నాణ్యమైన ఆహారం అందించేలా కార్పొరేట్ స్థాయిలో క్యాంటీన్లను తీర్చిదిద్దుతున్నామని ప్రకటించింది. ఆ స్థాయిలో నిధులు కూడా విడుదల చేస్తోంది. ఉప్మా, ఇడ్లీ, వడ, పూరి రుచిగా ఉంటున్నా.. పరిమాణం తగ్గుతోంది. చట్నీ పూర్తిగా నాసిరకంగా ఉంటోంది. సంస్థలో ప్రతీరోజు సుమారు 48 వేల మంది కార్మికులు, ఉద్యోగులు క్యాంటీన్లలో అల్పాహారం భుజిస్తున్నారు.

ఓసీపీలు, భూగర్భ గనులపై 31 క్యాంటీన్లు..

సంస్థలో 89 క్యాంటీన్లు ఉండగా, 31క్యాంటీన్లు ఓసీపీలు, భూగర్భగనులపై నిర్వహిస్తున్నారు. మిగతావి వివిధ డిపార్ట్‌మెంట్లలో కొనసాగుతున్నాయి. ఇవికాకుండా మరో 14క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతను కాంట్రాక్టర్లకు అప్పగించింది. ఓసీపీల్లో క్యాంటీన్ల అవసరం అధికం. అందుకే అందులోని ఒక్కో కార్మికుడిపై ప్రతినెలా రూ.200 చొప్పున రాయితీ చెల్లిస్తోంది. ఓసీపీల్లో ప్రతీషిఫ్ట ప్రారంభంతోపాటు టీ బ్రేక్ సమయంలో కూడా చాలా మంది అల్పాహారం తింటున్నారు. అలాగే భూగర్భగనుల్లో పని చేస్తున్న కార్మికులకు ప్రతీనెల రూ.120 చొప్పున, డిపార్ట్‌మెంట్లపై రూ.110 చొప్పున యాజమాన్యం వెచ్చిస్తోంది. ఈ లెక్కన సుమారు 48 వేల మంది ఉద్యోగులకు సరాసరి రూ.150 చొప్పున రాయితీ చెల్లిస్తే.. ప్రతీనెల సింగరేణిపై రూ.72లక్షల భారం పడుతోంది. ఇన్ని నిధులు వెచ్చిస్తున్నా కార్మికులు తృప్తిగా టిఫిన్ చేయడంలేదంటున్నారు.

నాణ్యత పెంచాలి



సింగరేణి క్యాంటీన్లలో నాణ్యత పెంచాలి. స్ట్రక్చరల్ సమావేశాల్లో ఈ విషయంపై మాట్లాడాం. 2013లో షెడ్యూల్ ఇచ్చారు. షెడ్యూల్ రేట్ పెంచాలి. ప్రస్తుత అలవాట్లకు అనుగుణంగా మెనూలో మరిన్ని రకాలు చేర్చాలి. పూరి, ఉప్మా, వడ, ఇడ్లీ కాకుండా దోశ, పెసరట్టు, ఊతప్ప, రాగిదోశ, రాగిసంకటి, మిల్లెట్‌ఉప్మా తదితర ఆహార పదార్థాలు అందించాలి. ప్రైవేట్ క్యాంటీన్లలో నాణ్యత తగ్గింది. వాటిని మూసివేయాలి. సూపర్‌బజార్ల నుంచే క్యాంటీన్లకు నిత్యావసరాలు సరఫరా చేయాలి.

– సీతారామయ్య, అధ్యక్షుడు, ఏఐటీయూసీ

నూనె మళ్లీ వాడవద్దు



ఒకసారి వినియోగించిన నూనె మళ్లీ వాడితే అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. పరిమాణం సరిగా ఉండటం లేదు. ప్రైవేట్ క్యాంటీన్లలో నాణ్యత తక్కువగా ఉంటోంది. సింగరేణి యాజమాన్యం కొత్త మెనూ రూపొందించాలి. గుండెపోటు, బీపీ, షుగర్ సమస్యలు ఎక్కువగా వస్తున్న క్రమంలో మెనూ రూపకల్పనకు కమిటీ వేయాలి. క్యాంటీన్లు శుభ్రంగా ఉండటం లేదు. స్టోర్ రూంలలో ఎలుకలు తిరుగుతున్నాయి. పాత ఆయిల్ తీసుకున్న తర్వాతే కొత్త ఆయిల్ ఇవ్వాలి.

– తుమ్మల రాజారెడ్డి, అధ్యక్షుడు, సీఐటీయూ

క్యాంటీన్లలో ధరల పట్టిక

టిఫిన్	పరిమాణం	ధర (రూ.లలో)
ఇడ్లీ	ఒకటి	1
మినపవడ	ఒకటి	1
ఉప్మా	ఒకగరిట	1
పూరి	ఒకటి	1
టీ	ఒకకప్పు	1
కాఫీ	ఒకకప్పు	2
మసాలవడ	ఒకటి	1
ఫ్రైడ్‌రైస్	400(గ్రాములు)	15
ఆలుబిర్యాని	400(గ్రాములు)	15
కిచిడి	400(గ్రాములు)	15
పులిహోర	400(గ్రాములు)	15
సింగరేణిలోని క్యాంటీన్లు		89
సంస్థ నిర్వహించేవి		75
కాంట్రాక్టర్ల నిర్వహణ		14

ప్రతీనెల కేటాయిస్తున్న బడ్జెట్(రూ.లక్షల్లో)	72
ఒక్కోఉద్యోగిపై వెచ్చించే సొమ్ము(రూ.లలో – ఓసీపీ)	200
ఒక్కోఉద్యోగిపై వెచ్చించే సొమ్ము (రూ.లలో – అండర్‌గ్రౌండ్)	120
ఒక్కోఉద్యోగిపై వెచ్చించే సొమ్ము (రూ.లలో – డిపార్ట్‌మెంట్లు)	110

ఆర్టిజన్లను విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించాలి

- ప్రారంభమైన సిబ్బంది రిలేదీక్షలు



ఎస్ఈ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న ఆర్టిజన్లు

పెద్దపల్లిరూరల్: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్లను ఉద్యోగులుగా గుర్తించాలని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. తమను విద్యుత్ ఉద్యోగులుగా పరిగణించాలనే డిమాండ్‌తో స్థానిక ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆర్టిజన్లు సోమవారం రిలేదీక్షలు ప్రారంభించారు. రామకృష్ణారెడ్డి, ముత్యంరావు శిబిరాన్ని సందర్శించి ఆర్టిజన్లకు సంఘీభావం ప్రకటించారు. ఉద్యోగులతో సమానంగా సుమారు ఏడేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నా.. ఆర్టిజన్లుగా పేరు పెట్టి శ్రమదోపిడీ చేస్తున్నారని వారు ఆరోపించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్టిజన్లను వెంటనే విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క దృష్టికి కూడా తీసుకెళ్లామని ఆర్టిజన్ల సంఘం జిల్లా కన్వీనర్ కిషన్‌రెడ్డి తెలిపారు. నాయకులు రాజు, విశ్వనాథ్, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లయ్య, రఘు, సందీప్, దేవేందర్, రవి, సతీశ్‌రెడ్డి, శ్రీనివాస్, కృష్ణ, శరత్, రాజబాబు, సుమన్, నర్సయ్య, రాజేందర్, శేఖర్, యూసుఫ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.







చకచకా 'పెద్ద'పల్లి రైల్వేస్టేషన్ పనులు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఆధునీకీకరణ పనులు చకచకా సాగుతున్నాయి. అమృత్ పథకంలో చోటు దక్కించుకున్న పెద్దపల్లి రైల్వేస్టేషన్.. ఆధునిక హంగులు సంతరించుకుంటోంది. పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయి. ఈనేపథ్యంలో వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. టికెట్ కౌంటర్ కోసం తాత్కాలిక షెడ్డు నిర్మించారు. రైల్వేస్టేషన్‌లోని లోడింగ్, అన్‌లోడింగ్ పాయింట్ వద్ద పనులు కొనసాగిస్తున్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయుడిపై కేసు

జమ్మికుంట: ప్రైవేటు చిట్టీలు నడుపుతున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి తెలిపారు. మండలంలోని పాపయ్యపల్లి గ్రామానికి చెందిన రాపెల్లి కుమారస్వామి పట్టణానికి చెందిన మేకల శ్యామ్ సుందర్‌రెడ్డి అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడి వద్ద 2022 నుంచి రూ.5లక్షల చిట్టి వేశాడు. నెలకు రూ.15వేల చొప్పున ఫోన్‌పే ద్వారా 25 నెలలు డబ్బులు చెల్లించాడు. చిట్టి డబ్బులు ఇవ్వాలని అడగ్గా.. చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

లైంగికంగా వేధిస్తున్న వ్యక్తి అరెస్టు

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలం అనంతగిరికి చెందిన వివాహితను లైంగికంగా వేధిస్తున్న కత్తెరపాక దిలీప్‌ను అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు పంపినట్లు ఇల్లంతకుంట ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. బోయినపల్లి మండలం కొదురుపాకకు చెందిన దిలీప్, అనంతగిరిక చెందిన వివాహితను వెంబడిస్తూ లైంగికంగా వేధించేవాడు. బాధితురాలి ఫిర్యాదుతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. నిందితునిపై బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే రెండు కేసులు ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి సంఘటనలో ఇద్దరి రిమాండ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని బండలింగంపల్లి శివారులోని వ్యవసాయ భూముల విషయంలో ఆదివారం ముగ్గురిపై దాడిచేసిన సంఘటనలో ఇద్దరిని పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. భూవివాదంలో గడ్డం పుష్పలతతోపాటు ఆమె ఇద్దరు కుమారులు కరుణాకర్, జగన్‌లపై దాడిచేసిన శ్రీనివాస్, నరేశ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగిలించి డబ్బులు డ్రా

మెట్‌పల్లి: ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండికి చెందిన గాండ్ల బాశెట్టి రణధీశ్ బ్యాంక్ ఖాతా నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు డ్రా చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 15న రణధీశ్ మెట్‌పల్లి నుంచి ఆర్మూర్‌కు బస్సులో వెళ్తుండగా సెల్‌ఫోన్ అపహరణకు గురైంది. అందులోని ఫోన్ పే నుంచి రూ.1.57లక్షలను వివిధ ఖాతాల్లోకి మళ్లించారు. దీంతో బాధితుడు ముందుగా సైబర్ క్రైం, తర్వాత మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఉరేసుకుని బాలిక ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలోని గంజి రోడ్డు ప్రాంతానికి చెందిన ఉమేయ తహేర్ (14) సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తహేర్ తొమ్మిదో తరగతి చదువుతోంది. నిత్యం సెల్‌ఫోన్ చూస్తూ ఉండడంతో మూడు రోజుల క్రితం తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదు చేసి గాలిస్తుండగా హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి ఆదివారం తల్లిదండ్రులకు అప్పగించారు. సోమవారం తల్లిదండ్రులు కోరుట్లలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఒంటరిగా ఉన్న బాలిక ఇంట్లో ఉరేసుకుంది. తల్లిదండ్రులు వచ్చేసరికి మృతిచెందింది. బాలిక మృతికి నువ్వంటే నువ్వే కారణమని తల్లిదండ్రులు ఆస్పత్రిలో గొడవకు దిగారు. పట్టణ ఎస్సై కిరణ్ ఆస్పత్రికి చేరుకుని వారి సముదాయించారు. కుటుంబ సభ్యులతో ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఎన్టీపీసీలో ఉత్తుత్తి నియామకాలు!

- లెస్‌తో మ్యాన్‌పవర్ టెండర్లు దక్కించుకుంటున్న కాంట్రాక్టర్లు
- ఆ లోటు పూడ్చుకునేందుకు నిరుద్యోగులకు టోకరా!



గోదావరిఖనికి చెందిన రాజయ్య, నరేశ్ నిరుద్యోగులు. ఎక్కడా ఉపాధి లభించడంలేదు. ఎన్టీపీసీలోని తెలంగాణ ప్రాజెక్టులో కాంట్రాక్టు ఉద్యోగాలు(స్కిల్డ్) ఉన్నాయని తెలిసింది. తెలిసిన వారితో కాంట్రాక్టర్‌ను కలిశారు. తమకు ఉద్యోగం కావాలని అడగడంతో ఖర్చవుతుందని కాంట్రాక్టర్ చెప్పారు. ఇందుకోసం ఒక్కొక్కరు రూ.2లక్షల చొప్పున మొత్తం రూ.4 లక్షలను కాంట్రాక్టర్‌కు ముట్టజెప్పారు. రెండు నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు రాలేదు. డబ్బులు వాపస్ ఇవ్వడంలేదు. తెలిసినవారి వద్ద తెచ్చిన అప్పులకు వడ్డీ పెరిగిపోతోంది. ఏం చేయాలో తోచక యువకులు ఆందోళన చెందుతున్నారు.

జ్యోతినగర్(రామగుండం): రామగుండంలోని ఎన్టీపీసీ తెలంగాణ విద్యుత్ ప్రాజెక్టులో ఉత్తుత్తి నియామకాల దందా జోరుగా సాగుతోంది. వివిధ విభాగాల్లో పనులు దక్కించుకున్న కొందరు కాంట్రాక్టర్లు ఉద్యోగాల్లోకి తీసుకుంటామని నిరుద్యోగుల వద్ద భారీగా వసూలు చేస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతంలో ఈదందా బాహాటంగానే వినిపిస్తోంది.

మ్యాన్ పవర్ సరఫరాకు టెండర్లు..

రామగుండం నియోజకవర్గంలో తెలంగాణ స్టేజ్–1 విద్యుత్ ప్రాజెక్టు పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. ఇందులోని వివిధ విభాగాల్లో మ్యాన్ పవర్‌ను సమకూర్చేందుకు ఎన్టీపీసీ యాజమాన్యం ఇటీవల టెండర్లు ఆహ్వానించింది. కొందరు కాంట్రాక్టర్లు ఉద్దేశపూర్వకంగానే మైనస్ కోట్ చేసి పనులు దక్కించుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. అంతేకాదు.. మైనస్ రూపంలో నష్టపోయిన డబ్బును రాబట్టుకునేందుకు ఉద్యోగ నియామకాల దందాకు తెరలేపారు. నిరుద్యోగుల ఆశను అవకాశంగా తీసుకున్నారు. ఒక్కో యువకుడి నుంచి రూ.2 లక్షల – రూ.5 లక్షల వరకు సుమారు 20మంది వద్ద వసూలు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఉద్యోగాలు ఇవ్వకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

పనిలోకి తీసుకోరు.. డబ్బు వాపసు చేయరు..

కాంట్రాక్టర్లు డబ్బులు వసూలు చేసి రెండు నెలలు గడుస్తున్నా.. యువకులను విధుల్లోకి తీసుకోలేదు. డబ్బులు ముట్టజెప్పామని, ఇక తమకు కచ్చితంగా ఉద్యోగం వస్తుందనే నమ్మకంతో ఉన్నారు. కానీ, ఉద్యోగం కోసం తెలిసిన వారివద్ద తెచ్చిన అప్పులకు వడ్డీ పెరిగిపోతోంది. ఇటు ఉద్యోగం కూడా రావడం లేదు. కాలం గడిచిపోతోంది. ఏం చేయాలో తోచక యువకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ వారసులకు కొలువులు వస్తాయని నమ్మిన తల్లిదండ్రులు.. పనులు లేక తమ కళ్లెదుటే తిరుగుతున్న సంతానాన్ని చూసి కన్నీటిపర్యంతమవుతున్నారు. తమకు డబ్బులైనా వాపస్ ఇవ్వండి, లేదా ఉద్యోగంలోకైనా తీసుకోండని కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే.. రేపు, మాపు అని కాలయాపన చేస్తున్నారు.

మైనస్ టెండర్లే కారణమా?

జాతీయ సంస్థ ఎన్టీపీసీలో మ్యాన్ పవర్ సరఫరా కోసం గతేడాది సెప్టెంబరులో ఆన్‌లైన్ పద్ధతిన జెమ్ పోర్టల్(గవర్నమెంట్ ఈ– మార్కెట్ ప్లేస్)లో టెండర్లు ఆహ్వానించింది. డిప్లొమా ఎలక్ట్రికల్ ఆపరేటర్, ఐటీఐ ఆపరేటర్లు 35 మంది కావాలని సూచించింది. టెండరు గడువు రెండేళ్లుగా నిర్ధారించింది. గత అక్టోబరుతో టెండరు దాఖలు గడువు ముగిసింది. జీఎస్టీతో కలిపి టెండరు విలువ సుమారు రూ.2,82,76,953.60గా పేర్కొంది. కానీ, 39.99 శాతం లెస్(సుమారు రూ.1.13 కోట్లకు)తో కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకున్నారు.

'లెస్'తోనే వసూళ్లు..?

మైనస్‌కు టెండర్లు దక్కించుకున్న కొందరు కాంట్రాక్టర్లు.. ఆ లోటును పూడ్చుకునేందుకు తాము నియమించుకునే యువతనే ఆదాయ వనరుగా ఎంచుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. అయితే, సంస్థ ఉన్నతాధికారులు లెస్ టెండర్లపై పునరాలోచించాలని, మ్యాన్ పవర్ కోసం పిలిచే టెండర్లు పకడ్బందీగా ఉండాలని పారిశ్రామిక ప్రాంత నిరుద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బ్యాంకు ఎదుట రైతుల నిరసన



నిరసన తెలుపుతున్న రైతులు

రామగిరి(మంథని): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీకాలనీ కేడీసీసీ బ్యాంక్ ఎదుట సోమవారం రైతులు నిరసన తెలిపారు. తమకు రుణమాఫీ అమలు కాకపోవడంలో అధికారుల పొరపాట్లు ఉన్నాయని ఆరోపించారు. క్రాప్‌లోన్ రెన్యూవల్ చేసుకున్న ఖాతాదారులకు పాత ఖాతాను మూసివేసి కొత్త ఖాతా నంబరు జారీ చేయడంతో రుణమాఫీకి దూరమయ్యామని అన్నారు. సుమారు 54 మందికి రూ.50.12 లక్షలు తమ ఖాతాల్లో జమకాకుండా డిపాజిట్లు ఫ్రీజ్ అయి ప్రభుత్వానికి తిరిగి వెళ్లాయని ఆవేదన చెందారు. ఏడు నెలలుగా బ్యాంక్ చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై మేనేజర్ గాంధీ నాయక్‌ను సంప్రదించగా.. సాంకేతిక కారణాలతో వారికి రుణమాఫీ వర్తించలేదన్నారు. రుణమాఫీ కాని ఖాతాదారుల జాబితాను రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డిని సంప్రదించగా.. జిల్లావ్యాప్తంగా సుమారు 617 ఖాతాలు ఇలా ఉన్నాయని, వీటిపై ప్రభుత్వానికి నివేదించామన్నారు.

మూతపడుతున్న ఆన్‌లైన్ యాప్‌లు

- ఆందోళన చెందుతున్న పెట్టుబడిదారులు
- మధ్యవర్తులపై ఒత్తిళ్లు
- కేసులు నమోదు చేస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలో ఎక్కువ వడ్డీ వస్తుందన్న ఆశతో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టిన వారికి ఆన్‌లైన్ కంపెనీలు రోజుకోటి బోర్డులు తిప్పేస్తుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. యాప్‌లు నిలిచిపోవడంతో తమ పెట్టుబడులు ఎలా తీసుకోవాలన్నదానిపై ఆందోళన చెందుతుండగా మధ్యవర్తులుగా ఉన్నవారిపై తీవ్ర ఒత్తిళ్లు పెంచుతున్నారు. దీంతో వారు కూడా గుట్టచప్పుడు కాకుండా హైదరాబాద్, ముంబై వెళ్లి కంపెనీ నిర్వాహకులతో చర్చలు జరుపుతున్నామంటూ కాలం వెళ్లదీస్తున్నారు. జగిత్యాల జిల్లాలో సుమారు రూ.150 కోట్ల మేరకు పెట్టుబడి పెట్టిన పలు కంపెనీలు రెండునెలల్లో సుమారు నాలుగు మూతపడ్డాయి. దీంతో పెట్టుబడి పెట్టిన కొన్ని కంపెనీలు వారికి ఆన్‌లైన్ కంపెనీ యాప్‌ను మార్చుతున్నామని, ఆందోళన చెందవద్దని సమాచారం అందించారు. జిల్లాలో సుమారు ఇప్పటికే నాలుగు యాప్‌లు మూతపడ్డాయి.

మూతపడిన కంపెనీలు

జిల్లాలో పెట్టుబడి పెట్టిన నాలుగు ఆన్‌లైన్ యాప్‌లు రెండు నెలలుగా మూతపడ్డాయి. దీంతో తాము ఎవరిపై ఫిర్యాదుచేయలో తెలియక అయోమయంలోఉన్నారు. ఇప్పటికే మోసపోయిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జిల్లాలో రెండు కంపెనీలపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొంతమంది పెట్టుబడిదారులు ఇప్పటికే జైలుకు వెళ్లారు. మరికొందరు హైకోర్టు నుంచి బెయిల్ తెచ్చుకున్నారు.

పరారీలో నిందితులు

వాస్తవానికి పోలీసులు కంపెనీ నిర్వాహకులపై కేసులు పెట్టాల్సి ఉండగా వారి వివరాలు లేకపోవడంతో పెట్టుబడి పెట్టించిన వారిపైనే కేసులు నమోదు చేశారు. దీంతో అసలు యాప్ తయారుచేసి పెట్టుబడులు పెట్టేలా చేసిన యాప్ యజమానులు పరారీలో ఉన్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం



జిల్లాలో ఇప్పటికే యాప్ పెట్టుబడులు పెట్టించి మోసానికి పాల్పడగా బాధితుల ఫిర్యాదు మేరకు ఓ కంపెనీపై కేసులు నమోదు చేసి కొందరిని రిమాండ్‌కు తరలించాం. ఎవరైనా బాధితులుంటే ఫిర్యాదు చేయాలి. యాప్‌లపై కేసులు నమోదు చేసి చర్యలు చేపడతాం.

– అశోక్‌కుమార్, ఎస్పీ, జగిత్యాల

స్వచ్ఛంద సంస్థ పేరిట ఘరానా మోసం

- కలెక్టరేట్‌కు తరలి వచ్చిన బాధితులు



కలెక్టరేట్‌కు తరలి వచ్చిన గ్రామస్తులు

సిరిసిల్లటౌన్: స్వచ్ఛంద సంస్థ ద్వారా తక్కువ ధరకే డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని డబ్బులు వసూలు చేసి బోర్డు తిప్పేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ సమీప బంధువు కావడంతోనే నమ్మి మోసపోయినట్లు ముస్తాబాద్ మండలం మోహినికుంట, మద్దికుంట గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి విలేకరులతో తమ గోడు వెల్లబోసుకున్నారు. 2020లో బెంగళూరుకు చెందిన 'హోలి వరల్డ్ సిటిజెన్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్' అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తమ గ్రామాలకు వచ్చారన్నారు. సొంత స్థలం ఉన్న వారికి రూ.3.50లక్షలకే కేంద్ర, రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా వచ్చే డబ్బులతో ఇల్లు కట్టిస్తామని నమ్మబలికారని తెలిపారు. అప్పటి సీఎం కేసీఆర్‌కు సమీప బంధువైన ప్రజాప్రతినిధితో తమతో మాట్లాడించగా.. 70 మందిమి రూ.కోటి వరకు చెల్లించినట్లు వివరించారు. రెండేళ్ల తర్వాత కూడా ఇండ్లు నిర్మించకపోగా.. 2022లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీంతో సదరు ప్రజాప్రతినిధితో వచ్చి సంస్థ ప్రతినిధులు చెక్కులు అందించి తమ వద్ద ఉన్న సంస్థకు చెందిన బాండ్లను తీసుకున్నారన్నారు. చెక్కులు ఇచ్చారుగా గొడవ చేయొద్దని సదరు ప్రజాప్రతినిధి తెలిపారని, అయినా చెక్కులు ఇప్పటికీ పాస్ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు బాధ్యులను ప్రశ్నిస్తే ఏం చేసుకుంటారో చేసుకోండ్రని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయంలో కలెక్టర్ కలగజేసుకుని తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు నరేశ్, శ్రీనివాస్, లక్ష్మి కోరారు.

కుల బహిష్కరణపై ఫిర్యాదు



ఎస్పీ కార్యాలయం ముందు బాధితులు

జగిత్యాలక్రైం: బాలపల్లి గ్రామానికి చెందిన దొందరి గంగారాం, ఒర్రె సాయవ్వ, జక్కుల శారద, బైరి రాధ తమను కుల బహిష్కరణ చేశారని ఎస్పీ అశోక్‌కుమార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన గొల్లకుర్మలు ఏటా సంక్రాంతి, ఉగాది పండుగలకు బోనాలు తీస్తారు. సంక్రాంతి సందర్భంగా తీసే బోనాలకు తమ కుటుంబాలకు సమాచారం అందించలేదని బాధితులు పేర్కొన్నారు. ఈ విషయమై గ్రామస్తుల సమక్షంలో కులస్తులను అడిగితే తమను కులం నుంచి బహిష్కరించామన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కాలినడకన రాజన్న చెంతకు..

- కాలినడకన రాజన్న చెంతకు..
- పల్లికొండ నుంచి వేములవాడకు..
- 60 కిలోమీటర్లు పాదయాత్రగా కదిలిన మహిళలు



రాజన్న దర్శనానికి కాలినడకన వెళ్తున్న భక్తులు

సిరిసిల్ల: మొక్కు తీర్చుకోవాలన్న తలంపు వారిని పాదయాత్రగా కదిలించింది. దాదాపు 60 కిలోమీటర్లు నడిచి వచ్చి వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం పల్లికొండ గ్రామానికి చెందిన 28 మంది మహిళలు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకునేందుకు కాలినడకన బయలుదేరారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యం ఉన్నా.. కాలినడకన రావాలన్న మొక్కు తీర్చుకునేందుకు సోమవారం ఉదయం 6 గంటలకు పల్లికొండ నుంచి నడకను ప్రారంభించారు. మానాల, రుద్రంగి, చందుర్తి మీదుగా వేములవాడకు చేరుకోవాలి. కానీ ఒక్క రోజులో 60 కిలోమీటర్ల ప్రయాణం సాధ్యం కాకపోవడంతో సోమవారం రాత్రి చందుర్తి మండలంలో బసచేసి, మంగళవారం వేములవాడకు చేరుకొని రాజన్నను దర్శించుకోవాలని వస్తున్నారు.

రెండుచోట్ల అగ్ని ప్రమాదాలు



దాబాలో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్‌క్రైం: నగరంలో రెండు చోట్ల సోమవారం వేకుజామున అగ్నిప్రమాదాలు జరిగాయి. అగ్నిమాపక అధికారుల వివరాల ప్రకారం.. కరీంనగర్– పెద్దపల్లి బైపాస్‌లోని సోహెల్ దాబా పక్కన గుర్తు తెలియని వ్యక్తులు మంటకాగడంతో అగ్నికీలలు దాబాపై పడి మంటలు చెలరేగాయి. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపుచేశారు. సుమారుగా రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. మంచిర్యాల చౌరస్తాలోని ఒక టింబర్ డిపోలో స్వల్పంగా కర్రలు కాలిపోయాయని ఫైర్ అధికారులు తెలిపారు.

సీపీఐది పోరాటాల ఘనత

- పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి: భారతదేశ గడ్డపై వందేళ్ల మహోజ్వల పోరాటాలు, త్యాగాల చరిత్ర కలిగిన పార్టీ ఒక్క సీపీఐ మాత్రమేనని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా సోమవారం చిగురుమామిడిలో రెడ్‌షర్ట్ వలంటీర్లు వంద జెండాలు చేతబట్టి సర్దార్ సర్వాయిపాపన్న విగ్రహం నుంచి బస్టాండ్ మీదుగా మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. చాడ వెంకట్‌రెడ్డి, మర్రి వెంకటస్వామి ర్యాలీలో పాల్గొన్నారు. సభకు మండల సీపీఐ కార్యదర్శి లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించారు. చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. 1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించిందన్నారు. వేలాదిమంది అమర వీరుల త్యాగాల ఫలితంగా నేటికీ పార్టీ మనుగడ కొనసాగుతోందన్నారు. చిగురుమామిడి మండలం ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు సీపీఐకి కంచుకోటగా ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటాలని సూచించారు. పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో సీపీఐకి చిగురుమామిడి గుండెకాయలాంటిదన్నారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు అందెస్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు అందె చిన్నస్వామి, చాడ శ్రీధర్‌రెడ్డి, ముద్రకోల రాజయ్య, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, ఇల్లందుల రాజయ్య, బోయిని పటేల్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ చాంపియన్ కరీంనగర్

- ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు



కరీంనగర్ జట్టుకు టోపీ అందిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్

కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి 46వ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. చాంపియన్‌గా ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు జయకేతనం ఎగురవేసింది. ద్వితీయ, తృతీయస్థానాల్లో వరంగల్, మహబూబ్‌నగర్, నాలుగోస్థానంలో ఆదిలాబాద్ జట్లు నిలిచాయి. పోటీలకు రాష్ట్రంలోనే పాతపది జిల్లాలనుంచి 200మంది క్రీడాకారులు, 50మంది కోచ్‌లు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయపోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు నిర్వాహకులు ఎంపిక చేశారు. అంతకుముందు కరీంనగర్, వరంగల్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగగా 18–16 స్కోరు తేడాతో కరీంనగర్ విజేతగా నిలిచింది. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, డీఆర్‌వో పవన్‌కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి అనిల్‌కుమార్, రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ హాజరై విజేతలకు ట్రోఫీలు అందించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి నెమలికొండ ప్రభాకర్, రెఫరీల బోర్డు కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, మూల వెంకటేశ్ పాల్గొన్నారు.

నా తండ్రిని సాదండి సారూ..

- నిస్సహాయ స్థితిలో కొడుకు మొర
- సిరిసిల్ల కలెక్టర్‌ను ఆశ్రయించిన నేతన్న



తండ్రిని సాదాలంటూ కలెక్టర్‌ను ఆశ్రయించిన గోనె శేఖర్

సిరిసిల్లటౌన్: కొందరి కష్టాలు చూస్తుంటే పగవారికి కూడా రావొద్దని పిస్తుంటుంది. ఇటువంటి కష్టమే సిరిసిల్ల నేతన్నకు వచ్చింది. తాను నిస్సహాయ స్థితిలో ఉండగా సుమారు 90 ఏళ్ల వయస్సు ఉన్న తండ్రిని సాదలేనన్న బాధతో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాను ఆశ్రయించన వైనం పలువురిని కంటతడి పెట్టించింది. సిరిసిల్ల పట్టణానికి చెందిన గోనె శేఖర్ నేతకార్మికుడి(గతంలో)గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొడుకులు ఎవరూ లేరు. భార్య బీడీలు చుట్టేది కానీ గుండె జబ్బు బారిన పడడంతో పనిమానేసింది. నాలుగేళ్లుగా తనకు కూడా కాళ్లు సరిగ్గా పనిచేయక ఇంట్లోనే ఉంటున్నట్లు తెలిపారు. తన తండ్రికి మతిస్థిమితం సరిగ్గా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసారా పింఛన్ డబ్బులతోనే తనకు, తన భార్యకు మందులు వెల్ల దీసుకుంటున్నట్లు తెలిపారు. మండేపల్లి శివారులోని కేసీ ఆర్‌నగర్‌లో ఉంటున్నామన్నారు. ఈక్రమంలోనే ఇంట్లో ఎవరికీ ఏ చికిత్స అవసరం పడ్డా చేయించుకోలేని స్థితిలో ఉన్నామన్నారు. తన తండ్రిని సాదాలని ఉన్నా తన నిస్సహాయ స్థితిని తలుచుకుని రోదించారు. కలెక్టర్ దయతలచి తన తండ్రి రామస్వామిని వృద్ధాశ్రమంలో చేర్పించి, వైద్యం చేయించాలని కోరారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా సంక్షేమ శాఖ అధికారులు విచారణ చేపట్టి రామస్వామిని వృద్ధాశ్రమానికి తరలించే ఏర్పాట్లు చేశారు. గోనె శేఖర్ పరిస్థితిని చూసి ప్రజావాణికి వచ్చిన వారిని కలచివేసింది.

ముస్తఫానగర్ శివారులో చిరుత సంచారం



గేదె కళేబరం పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని ముస్తఫానగర్ శివారులో చిరుత సంచారం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. గ్రామానికి చెందిన రాసమల్ల రాజు పొలం వద్ద గుడిసెలో కట్టేసిన గేదెపై చిరుత దాడి చేసింది. గేదె కళేబరాన్ని అటవీశాఖ అధికారులు పరిశీలించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కల్పనాదేవి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అంజలి, ఫారెస్ట్ అధికారి రమేశ్ రైతులతో మాట్లాడారు. గేదెపై పులి దాడిచేసిన నేపథ్యంలో ఎవరూ అడవిలోకి వెళ్లవద్దని, పంట పొలాల్లో పశువులను కట్టివేయవద్దని, ఇంటికి తెచ్చుకోవాలని సూచించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



పిట్ల లింగన్న (ఫైల్)

ఇబ్రహీంపట్నం: అప్పుల బాధతో ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అనిల్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్ల లింగన్న అలియాస్ తోకల లింగన్న (41) తనకున్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తల్లిదండ్రులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారికి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నాడు. ఈ ఖర్చుతోపాటు పంటల సాగుకు పెట్టుబడి పెడుతున్నాడు. ఇలా మొత్తం సుమారు రూ.15 లక్షల వరకు అప్పు అయ్యింది. వాటిని ఎలా తీర్చాలని నిత్యం మదనపడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 14న తన పొలానికి వెళ్లాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెదుకగా క్రిమిసంహారక మందు తాగి పడిపోయి కనిపించాడు. వెంటనే అతడిని మెట్‌పల్లిలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందాడు. లింగయ్యకు కొడుకు, కూతురు ఉన్నారు. లింగన్న భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదూరులో వృద్ధుడు..



ఆశన్న (ఫైల్)

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోదూర్ గ్రామానికి చెందిన రెబ్బాస్ ఆశన్న (72) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అనిల్ కథనం ప్రకారం.. ఆశన్న భార్య శాంత మూడు నెలల క్రితం గుండెపోటుతో చనిపోయింది. అప్పటి నుంచి తీవ్రంగా మదనపడుతున్నాడు. సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో పురుగుల మందు తాగాడు. చిన్న కుమారుడు శాంతకుమార్ గమనించి వెంటనే మెట్‌పల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆశన్న పెద్ద కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కోల్‌సిటీ: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా తమ కాళ్ల మీద తాము నిలబడేందుకు ప్రయత్నం చేయాలని రామగుండం నగరపాలక మేయర్ బంగి అనిల్‌కుమార్ కోరారు. సోమవారం స్వశక్తి మహిళలు ఏర్పాటు చేసుకున్న మొబైల్ ఫుడ్ కోర్ట్‌ను జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీతో కలిసి నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ప్రారంభించారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీ మాట్లాడుతూ.. మెప్మా సహకారంతో రుణాలు పొంది స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకొని స్వశక్తి మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. మొబైల్ ఫుడ్‌కోర్ట్ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన సిరిచందన మహిళా పొదుపు సంఘం(కల్ప క్షవ్యం మహిళా సమాఖ్య) సభ్యురాళ్లను అభినందించారు.

హరహర మహాదేవ



వేములవాడ: రాజన్న ఆలయంలో సోమవారం జనజాతర కనిపించింది. ఆలయ ఆవరణ, క్యూలైన్లు, జాతరగ్రౌండ్ ప్రాంతాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. రద్దీని గమనించిన ఆలయ అధికారులు గర్భగుడి దర్శనాలు, అభిషేకాలు, అన్నపూజలను రద్దు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా భద్రతలో భాగంగా జిల్లా పోలీసులు బాంబుస్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించారు. శివదీక్షాపరుల నిత్యాన్నదానసత్రానికి వరంగల్‌కు చెందిన వాగ్దేవి విద్యాసంస్థల అధినేత దేవేందర్‌రెడ్డి దంపతులు కోసం రూ.1,01,116 విరాళం అందించారు. ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవోలు శ్రీనివాస్, శ్రవణ్, సత్రం కోశాధికారి రాపెల్లి శ్రీధర్, గౌరవ అధ్యక్షుడు మచ్చ కిషన్, కార్యదర్శి రమణయ్య ఉన్నారు.



